# మూలం: జీవననాదం

నాగభూషణాచార్యులు, ఎన్.వి.ఎస్.

(గత సంచిక తరువాయి)

మా పరీక్షల బాయ్‌కాట్ ఉద్యమం విజయవంతమైందని భావించాం. అయితే కొంత మంది దొంగదారుల గుండా పరీక్షా కేంద్రాల్లో ధూరి పరీక్ష రాసినట్లు మాకు తెలియదు. బయటున్నవాళ్లం అంతా అటు నుంచి అటే కలెక్టరేట్‌కు ఊరేగింపు జరిపాం. ఆ కార్యక్రమానికి కూడా పైన పేర్కొన్న నాయకుడే ముందుండి నాయకత్వం వహించి, ఈ రాత పరీక్షల కార్యక్రమాన్ని నిలుపుదల చేయించకపోతే, తాను రాజకీయాల నుండే విరమిస్తానని ప్రగల్భాలు పలికాడు. తర్వాత ఆయనే లోపాయికారీగా తనకు చైర్మన్ సన్నిహితుడైనందున పరీక్షల్ని రద్దు చేయించడం తథ్యమని, ఏమైనా ముందు న్యాయస్థానానికి పోవాలి గనుక 'రిట్' వేసేందుకు తలా ఓ వందా ఇవ్వాలని, ఇప్పుడు జేబులో లేకపోయినా, ఇంటికెళ్లి పంపించమనీ, కేసు గెలిచాక, పూర్తి వేతనంతో ఉపాధ్యాయ పోస్టులకు తిరిగి రాత పరీక్షలు పెట్టిస్తాననీ, నమ్మకంగా చెప్పాడు. ఈ రాజకీయ రాబందుల మాయమాటలు తెలియవు కనుక అందరం బోల్తా పడి డబ్బు ఇచ్చాం. అయితే రాత పరీక్ష రద్దు మాత్రం జరగలేదు. అదేమని అడిగితే కోర్టులో కేసు నిలవలేదనీ, జడ్జి కొట్టేశాడనీ అన్నారు. చైర్మన్ మిత్రు డు గనుక ఏదో చేస్తానన్నావు గదయ్యా అని నిలదీస్తే—ఇది ముఖ్యమంత్రి నిర్ణయం గనుక ఆయన తాను ఏం చెయ్యలేనని చెప్పాడని చెబుతూ మెల్లగా జారుకున్నాడు. ఈ విధంగా 'సామ్మూ పోయే, శనీ పట్టె' అన్న చందంగా పరీక్షల్ని బాయ్‌కాట్ చేసిన ఉద్యమవీరులంతా నష్టపోగా, పరీక్ష రాసిన కొద్దిమందీ దాదాపు అంతా సెలక్టయ్యారు. మరి కొద్దిమంది మిగిలితే, వాళ్లని కూడా వెయిటింగ్ లిస్టులో పెట్టి, అనతికాలంలోనే వారికి కూడా పోస్టింగ్‌లు ఇచ్చారు. అలా ప్రభాకరం కూడా ఉద్యోగం సంపాదించాడన్నమాట!

**   **   **

"ఏమిత్రా పట్టపగలే నడి రోడ్డు మీద కలలు కంటున్నావ్?" ప్రభాకరం మోచేత్తో పొడిచాడు.

"కలలు కాదురా, ఆ నాటి పరీక్షల బాయ్‌కాట్ గురించి, అలా చేయించిన నాయకుణ్ని గురించి తలచుకుంటున్నాను. ఆ నాయకుడెప్పుడూ నీతివాక్యాలే వల్లిస్తుంటాడు. ఇతరుల అవినీతి గురించి తీవ్రంగా విమర్శిస్తుంటాడు. సరే, ఇక ఇప్పుడు విచారించి లాభంలేదు గానీ, నీ పెళ్లికి తప్పకుండా వస్తాను మిత్రమా, కానీ ప్రెజెంటేషన్ మాత్రం ఏమీ తేలేను, నిరుద్యోగిని కదా!" అన్నాను.

"ఒరేయ్, చిన్నప్పట్నుంచీ ట్రెయినింగ్ దాకా మనం క్లాస్ మేట్సుం. నువ్వు రావడమే ఓ ప్రెజెంటేషన్! సరేనా?" ప్రభాకరం నా వీపు తట్టి, నా నుంచి సెలవు తీసుకుని, తనింటి వేపు వెళ్లాడు.

నేను ప్రభాకరం వెళ్లిన వేపే చూస్తూ, కాళ్లీడ్చుకుంటూ ఇంటికి నడిచాను. లోపలికి అడుగు పెట్టానో లేదో, అమ్మ ఎదురొచ్చింది. "రా బాబూ, నాన్నగారు నీ కోసమే భోం చెయ్యకుండా కూర్చున్నారు!" అన్నది.

నేను గబగబా దొడ్లోకి వెళ్లి, కాళ్లూ, చేతులూ, కడుక్కొని, వంటింట్లోకి నడిచాను. నాన్న ఆ సరికే పీట మీద జపం పూర్తి చేసుకుని కూర్చుని వున్నాడు.

నేనూ పీట మీద కూర్చుంటూ, "నువ్వు చేసెయ్యకపోయావా నాన్నా, నా కోసం చూస్తూ కూర్చోకపోతే?" అన్నాను.

నాన్న సమాధానం చెప్పలేదు. చిరునవ్వి, తల పంకించి ఊరుకున్నాడు. నాన్నా, నేనూ ఒకేసారి భోజనం చెయ్యడం మొదలు పెట్టామన్నమాటే గాని, నేను మొదటిసారి కలిపిన అన్నం పూర్తి కాక ముందే నాన్న భోజనం పూర్తి చేసి లేచాడు. కడుక్కున్న కాళ్లతడి ఆరక ముందే భోజనం పూర్తి చెయ్యాలన్నది ఆయన నియమం. నేను, నా అలవాటు ప్రకారం ఏదో ఆలోచించుకుంటూ అన్నం తినసాగాను. నా ఆలోచనలన్నీ ప్రభాకరం చుట్టూతానే తిరగసాగాయి.

వాడూ, వాడి పిలకా. కాలేజీ లేనప్పుడంతా అడ్డపంచెతోనే. ఈ రోజు నాగరికుడు!

మరి నేను... చిన్నప్పట్నుంచీ చదువూ, లైబ్రరీ తప్ప మరో ధ్యాసలేదు! పాతికేళ్లు దాటినా ఇంకా నేను ఉద్యోగార్థం ఆఫీసుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాను. నాన్న కష్టపడి సంపాదిస్తూంటే కూర్చుని తిం టున్నాను. ఇద్దరిలో ఎవరు ప్రయోజకుడు? వాడు చిన్నప్పట్నుంచీ చదువులో వెనకబడినా, ప్రయోజకత్వంలో నా కంటే ముందే వున్నా డు. తండ్రికి ఉడతాభక్తిగా సాయం చేశాడు. మరి నేను?

భోజనం ముగించి మడత మంచం మీద వాలాను. నా ఆలోచనలన్నీ కొద్ది సేపట్లోనే ఓ కొలిక్కి వచ్చాయి. ఒక దృఢమైన నిశ్చయానికి వచ్చాను. దాంతో మనసు ప్రశాంతమైంది.

తప్పకుండా, మరో ఆలోచన లేకుండా నా నిర్ణయాన్ని అమల్లో పెట్టగలనా? పెట్టాలి... తప్పదు!

గబగబా లేచి మొహం కడుక్కుని బయటకు వచ్చాను. పనిచావిట్లో యథాప్రకారం నాన్న ఒంటరిగా పని చేస్తున్నాడు. ఈ సారి తలుపు చెక్కకు చిత్రిక పడుతున్నాడు. టైం చూశాను. ఒంటి గంటే అయింది. పని కుర్రాడు రెండింటికి గానీ రాడు. "చిక్... చిక్.. చిక్... చిక్.. చీక్... ... చిక్.. చిక్... చిక్.. చిక్... చిక్... ...." చిత్రిక గుల్ల నుంచి లయబద్ధమైన సంగీతం వెలువడుతోంది. సంగీతసాధన చేస్తూ తన్మయత్వంలో నిమగ్నుడైన నాదబ్రహ్మలా నాన్న కళ్లు మూసుకునే చిత్రిక గుల్లతో చిత్రిక పడుతూ తలుపు చెక్కపై రాగాలు పలికిస్తున్నాడు.

ఎప్పుడూ చూసే దృశ్యమైనా ఈ నాడెందుకో నాన్న కొత్తగా కనబడుతున్నాడు. సమాధినిష్ఠుడైన యోగీశ్వరుడిలా కనిపిస్తున్న నాన్న మొహం, ప్రశాంతంగా దివ్యకాంతుల్ని విరజిమ్ముతున్నట్లుంది.

"నాన్నా...!" నా పిలుపు నా చెవులకే కొత్తగా అనిపించింది. తన్మయత్వంలో ఉన్న నాన్నకి నా పిలుపు అంతరాయం కలిగించింది.

"ఏమిటి నాన్నా?" నాన్న గొంతుకలో అంతు లేని ఆప్యాయత! పిల్లల్నీ వాళ్లు నిరుద్యోగులైనప్పటికీ, కష్టపడి సంపాదిస్తూ వాళ్లను పోషించే నాన్నలు అందరూ ఇంతగా ప్రేమిస్తారా?

"నేను కూడా చిత్రిక గుల్ల లాగుతా నాన్నా!" నా భావుకత నుండి తేరుకుని, గుల్ల మీద చెయ్యి వేశాను.

"నీ మొహం, నువ్వేం లాగుతావురా?" నాన్న నా చెయ్యి సున్నితంగా తొలగించి, మళ్లీ ఒక్కడే పని చెయ్యబోయాడు.

మళ్లీ ఎక్కడ నిర్ణయాన్ని మార్చుకుంటానో అని, చప్పున చిత్రికగుల్ల ముందుండే బద్దీ మీద అటూ ఇటూ రెండు చేతులూ వేసి, "నిజం నాన్నా, పని చేస్తాను అదే... పని నేర్చుకుంటాను నాన్నా!" అన్నాను తడబడే గొంతుకతో.

నాన్న తలెత్తి నా మొహంలోకి చూశాడు పరీక్షగా. లోతైన ఆ చూపుల్లోకి నా చూపుల్ని కలపలేక, తల దించుకున్నాను.

"చూడునాన్నా... ఎవడికి అలవాటైనపని వాడు చెయ్యాలి! నేను చేసేపని నువ్వు చెయ్యలేవు. నువ్వు చదివినట్లు రేయింబవళ్లు నిద్రాహారాలు మాని నేను చదవగలనా?"

"..." నాన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేదు నేను.

నాన్న నా జవాబు కోసం ఎదురుచూడకుండా చెప్పుకుపోతున్నాడు "... నీకు ఉద్యోగం రాలేదని బాధపడకు. నీ దిగులు నేను గమనిస్తూనే ఉన్నాను. అందువల్ల ప్రయోజనం ఏముంది చెప్పు? నీ ప్రయత్నం నువ్వు గట్టిగానే చేస్తున్నావు. ఉద్యోగం నీ చేతుల్లో లేదు కదా! ఇంత చదివావు... ఈ రోజు కాకపోతే రేపొస్తుంది ఉద్యోగం. మరీ అంత నిరాశపడకు. నా చేతుల్లో ఇంకా చేవ ఉంది. బాధపడకు!" నా భుజం మీద అనునయంగా చేతులుంచాడు నాన్న.

వాటివంక చూశాను. ఆ చేతులు... వయస్సుమీరి ముసలితనంతో చర్మం ముడతలు పడినా, ఆ చేతుల్తో పోటీకి వచ్చే చేతులు ఆ చుట్టుపక్కల లేవు. చుట్టుపక్కల ఎంతమంది నిపుణులైన పనివాళ్లున్నా, నాన్నముందు తలవంచాల్సిందే!

ఉద్వేగాన్ని అణుచుకుంటూ నాన్న చేతులమీద చెయ్యివేశాను. నాన్న చేతులు వణకడం స్పష్టంగా గమనించాను. వయస్సు మీరడం వల్ల వచ్చిన వణుకా ఇది, లేక ఉద్వేగంతో వచ్చిందా? ఏమో చెప్పలేను.

నాకు ధైర్యం చెప్పి, మళ్లీ తనపనిలో నిమగ్నమయ్యాడు నాన్న.

ఎంతమంచి నాన్న! ఇలాంటి నాన్నకు పుట్టడం నా భాగ్యం! అయినా నాన్నమాటకు అడ్డు చెబుతూ అన్నాను "లేదు నాన్నా! ఏపనయినా అభ్యాసం మీద గానీ రాదని నువ్వే అంటావు కదా! మొదట్లో ఈపని కొద్దిసేపు చేస్తే అలుపు వచ్చేమాట నిజమే! కానీ కొద్దిరోజుల్లో అదే అలవాటవుతుంది. ఇంటిదగ్గర ఖాళీగా ఎన్నిరోజులు కూర్చోను? పని నేర్చుకుంటాను. ఉద్యోగం వచ్చినప్పుడు మానెయ్యవచ్చు. అందువల్ల నష్టమేముంది?" పట్టుదలగా చిత్రికగుల్ల ఒక్కణ్నే లాగసాగాను.

నాన్న మాట్లాడలేదు. కాసేపు అలాగే నిలబడి, ఏమనుకున్నాడో ఏమో, మెదలకుండా గుల్ల పట్టుబట్టి ముందుకు తోశాడు. నేను నావైపు లాగాను. అలా కొద్దిసేపు లాగే సరికే చేతులు నొప్పి పెట్టసాగాయి. అలాగే పట్టుదలగా లాగాను. కొంతసేపటికి చేతులు బండబారి ఊడిపోతాయేమోనన్నంత బాధ కలిగింది. ఇంక కొద్దిసేపు.. ఇంక కొద్దిసేపు అనుకుంటూ అలాగే లాగాను. జ్వరం వచ్చినట్లనిపించింది. స్పృహ కోల్పోతానేమో ననుకున్నాను. చదువులో నేనాపట్టుదల, పనిలో లేదా అనుకున్నాను. అలాగే పళ్ల బిగువున లాగసాగాను. చెమటలు కారుతున్నాయి. ఎక్కడినుండో పిల్లతెమ్మెర రివ్వున వీచి ప్రాణం లేచొచ్చినట్లనిపించింది.

"చిక్... చిక్... చిక్... చిక్... చిక్... ... ...
చిక్... చిక్... చిక్... చిక్... చిక్... ... ..."

చిత్రిక గుల్ల లయబద్ధమైన శబ్దం ఒక్కటే వినిపిస్తోంది. పనికుర్రవాడు బచ్చా రావడం గానీ, ఆశ్చర్యంగా అలా చూస్తూ నిలబడి పోవడం గానీ గమనించలేదు నేను.

** ** **

వరద రాజులు మాష్టారు కథ చెప్పడం ఆపి, అందరి వంకా చూశాడు.



నిశ్శబ్దంగా కథ వింటున్న శ్రోతలు, ఆయన కథ చెప్పడం ఆపేసరికి, ఏదో అసౌకర్యానికి గురైనట్లనిపించి అంతా ఆయన వంక చూశారు. ఒక విద్యార్థయితే లేచి నిలబడి" ఆపేశారేం మాష్టారూ.. తర్వాతేం జరిగింది? ఇంతకీ ఆయనకు ఉద్యోగం వచ్చిందా, లేదా?" అని అడిగేశాడు.

ఒక లెక్చరరైతే "ఇది ఒట్ఠి కథేనా మాష్టారూ... ఎక్కడైనా జరిగిన సంగతా!" అనడిగాడు.

మరో లెక్చరర్ "ఇంతకీ ఈ కథ చెప్పడంలో మీ ఉద్దేశం ఏమిటి? అందరూ ఉద్యోగాలు ఆశించకుండా, వృత్తిపనులు చేపట్టాలనా?" అని ధర్మసందేహాన్ని వ్యక్తం చేశాడు.

వరదరాజులు మాష్టారు చిరునవ్వు నవ్వాడు. "ఈ కథ చాలా ఇళ్లల్లో జరిగేదే. కచ్చితంగా చెప్పాలంటే నాకథే!"... ఇంకేదో చెప్పబోతూండగా, ఓ విద్యార్థి లేచి, "మరయితే మీకు ఉద్యోగం ఎలా వచ్చింది మాష్టారూ?" అని ప్రశ్నించాడు.

"చెబుతాను..." అంటూ చెప్పసాగాడు వరదరాజులు. "మా నాన్నగారి దగ్గర పని నేర్చుకోవడం మొదలు పెట్టినట్లు చెప్పాను కదా! అలా నేర్చుకుంటూ ఉండగానే ఒక సంవత్సరమన్నా తిరక్కుండానే, హఠాత్తుగా మా నాన్నగారు హార్ట్ ఎటాక్‌తో చనిపోయారు. అప్పులవాళ్లు చుట్టిముట్టి గొడవచేశారు. మా అన్నలు ఉద్యోగస్తులయినా గానీ, తమ దగ్గర చిల్లిగవ్వ లేదన్నారు. చివరికి ఉన్న ఆ ఒక్క ఎకరం పొలం అమ్మి అప్పు తీర్చాల్సి వచ్చింది. అమ్మా నేనూ మిగిలాం ఆ పూరింట్లో. అలా వచ్చీరానీ వడ్రంగం పనిచేస్తూనే అమ్మను పోషించసాగాను. ఇంతలో మా జిల్లా కలెక్టర్‌గా దయాచారి అనే ఓ మహానుభావుడు వచ్చాడు. ఆయన ఏ రాజకీయ నాయకుల, లంచగొండి అధికారుల ఒత్తిడికీ తలొగ్గక, స్వయంగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలిచ్చాడు. అప్పుడే నేను జిల్లాలో ఫస్టున వచ్చి గ్రేడ్ I తెలుగు పండిట్‌గా సెలక్టయ్యాను. రెండేళ్లలోనే పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాసి లెక్చరరయ్యాను. తర్వాతి సంగతి మీకు తెలిసిందే. పాఠాలు చెప్పీ చెప్పీ ఒకేపని వల్ల విసుగు పుట్టి కొంతా, అనారోగ్యం వల్ల కొంతా, అన్నిటికీ మించి రచనా రంగాన్ని సీరియస్‌గా తీసుకోవాలన్న ఆలోచనతో ఇప్పుడు వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుంటున్నారు. ఇంతకీ ఈ కథ మీకు చెప్పడం ఎందుకంటే —మనమంతా మనమూలాల్ని మరవకూడదని చెప్పడానికే. నేటి యువతరం చాలామంది చదువుకుని, నిరుద్యోగంతో బాధపడుతూ, ఏ చిన్న ఉద్యోగమైనా చేసేందుకు సిద్ధపడుతున్నాగానీ, తమ పెద్దలు చేసిన చేతివృత్తులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. కాస్తో కూస్తో చదువుకున్న ప్రతివాడూ చేతివృత్తుల్ని తక్కువగా, నీచమైనవిగా భావిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా అలానేర్పకుండా ఉండేందుకే చూస్తున్నారు. ఆ ఆలోచనా విధానాన్ని మార్చుకొమ్మని చెప్పేందుకే ఈ కథను చెప్పాను. ఏ పనయినా నేర్చుకుని మరిచిపొమ్మన్నారు. ఈ చేతివృత్తులు కూడా అంతే! చిన్నప్పుడే నేర్చుకుంటే, పెద్దయింతర్వాత తగిన ఉద్యోగం వస్తే మంచిదే, రాకపోతే నిరుద్యోగ సమయంలో అక్కరకు వస్తాయి!" అంటూ ముగించాడు వరదరాజులు మాష్టారు!

●